సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 1 । మార్చి । 2025



ముగిసిన బ్రహ్మోత్సవాలు
భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిశాయి. - 8లో



పట్టువస్త్రాల పరిశీలన
గుట్ట బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవారికి సమర్పించనున్న పట్టు వస్త్రాలను ఆలయ డిప్యూటీ ఈఓ పరిశీలించారు. - 8లో



పరిహారం చెల్లించాలి
సాగు నీరందక ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ కోరారు. - 9లో

న్యూస్‌రీల్

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి : డీఈఓ
చౌటుప్పల్ : కంప్యూటర్ పరిజ్ఞానం మనిషి జీవితంలో తప్పనిసరి అవసరంగా మారిపోయిందని, దానిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. చౌటుప్పల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన ఐడీబీఐ బ్యాంకు సమకూర్చిన కంప్యూటర్లను శుక్రవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో కంప్యూటర్ భాగమైందన్నారు. అదే విధంగా ఇంగ్లిష్ భాషపైనా ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ స్ఫూర్తి, ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, బ్యాంకు అధికారులు గీత, వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
భువనగిరి టౌన్ : నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికన సొంతకారు కారు కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు 2, 500 కిలో మీటర్ల వరకు తిరగవలసి ఉంటుందని, నెలకు రూ.33,000 అద్దె చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

8న జాతీయ లోక్ అదాలత్



పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశమైన న్యాయమూర్తులు

రామన్నపేట : మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ఉషశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. రాజీపడి కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని కోరారు. అనంతరంపోలీస్‌స్టేషన్ల వారీగా రాజీకి అవకాశం ఉన్న కేసుల గురించి చర్చించారు. సమావేశంలో ఎస్‌ఐలు పి.మల్లయ్య, యుగేందర్, నాగరాజు న్యాయవాదులు ఎం. వెంకట్‌రెడ్డి, డి.సత్తయ్య, ఎన్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి
యాదగిరిగుట్ట : రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం స్టేజీ వద్ద జరిగే అఖిలభారత తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలతో రైతులు తీవ్రంగా నష్టపోతారని, వాటిని రద్దు చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవం, గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బండి జంగమ్మ, కల్లెపల్లి మహేందర్, పేరబోయిన మహేందర్, గోరేటి రాములు, పేరబోయిన బంగారు, గోపగాని రాజు, మాటూరు మల్లయ్య, పాకలపాటి రాజు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి బ్రహ్మోత్సవ శోభ
నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో యాదగిరీశుడి ప్రధానాలయ ముఖమండపం

- విశ్వక్సేన ఆరాధనతో శ్రీకారం
- 7న ఎదుర్కోలు, 8న తిరుకల్యాణం
- విద్యుత్ దీపాలతో ఆలయం కనువిందు
- భక్తులకు ఈసారి స్వర్ణవిమాన గోపురంతో కొత్త అనుభూతి

యాదగిరిగుట్ట : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట పంచనారసింహుడి దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనంతో మొదలై శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను పాంచరాత్ర ఆగమ సిద్ధాంతానుసారంగా, సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలు, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈసారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు స్వర్ణ విమాన గోపురం కొత్త అనుభూతి పంచనుంది.

11 రోజులు జరిగే కార్యక్రమాలు ఇవీ..
- 1వ తేదీన ఉదయం 10గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ ఉంటుంది.
- 2న ఉదయం 8గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం, హవన పూజ



ఆలయాన్ని పూలతో అలంకరిస్తున్న సిబ్బంది

- 3న ఉదయం 9 గంటలకు మత్స్యవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7గంటలకు శేష వాహన సేవ.
- 4న ఉదయం 9గంటలకు వటపత్రశాయి అలంకారం, రాత్రి 7గంటలకు హంసవాహన సేవ.
- 5న ఉదయం 9గంటలకు శ్రీకృష్ణ (మురళీకృష్ణుడు) అలంకారం, రాత్రి 7గంటలకు పొన్న వాహన సేవ.
- 6న ఉదయం 9గంటలకు గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి 7గంటలకు సింహ వాహన సేవ.
- 7న ఉదయం 9గంటలకు జగన్మోహిని అలంకారం, రాత్రి 8గంటలకు అశ్వవాహన సేవ, ఆ తరువాత శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం.
- 8న ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై శ్రీస్వామి వారిని ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, 8.45 గంటలకు శ్రీస్వామి,అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం.
- 9న ఉదయం 9గంటలకు శ్రీమహావిష్ణు అలంకార సేవలో గరుఢ వాహనం సేవపై శ్రీస్వామివారి ఊరేగింపు, రాత్రి 8గంటలకు ఆలయ తిరు, మాఢ వీధుల్లో దివ్యవిమాన రథోత్సవం.
- 10న ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థస్నానం వేడు, రాత్రి 7 గంటలకు పుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం
- 11న ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవం, దోపు ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.



శ్రీస్వామివారి వాహన సేవలు



కొండపైన విష్ణు పుష్కరిణి

ఉత్తర మాడ వీధిలో కల్యాణం
శ్రీస్వామి, అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవానికి రాష్ట్రంతో పాటు దేశ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానాలయ ఉత్తర మాడవీధిలో కల్యాణవేడుక నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు రూ.3,000 టికెట్ తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ప్రథమ ప్రాకార మండపంలో అలంకార, వాహన సేవలు
శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైనవి అలంకార, వాహనసేవలు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి సేవలను తిరు, మాడ వీధుల్లో ఊరేగిస్తారు. తూర్పు మాడ వీధిలో శ్రీస్వామి వారి అలంకార సేవలను వేంచేపు చేసి.. అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు పారాయణాలు పఠిస్తారు. అలంకార సేవలను భక్తులకు దర్శించుకునేందుకు వీలుగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి



యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు పాంచరాత్ర ఆగమశాస్త్ర అనుసారంగా నిర్వహిస్తాం. అలంకార, వాహన సేవలు 3వ తేదీన ప్రారంభం అవుతాయి. ప్రధాన ఘట్టాలు ఎదుర్కోలు ఉత్సవం తూర్పు రాజగోపురం ఎదుట, కల్యాణోత్సవం ఉత్తర మాడ వీధిలో నిర్వహిస్తాం. ఆలయ తిరు, మాడ వీధుల్లో రథోత్సవం ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీస్వామి వారి ఆశీస్సులు పొందాలి.

–కాందూరి వెంకటచార్యులు, ప్రధానార్చకులు

రూ.3.15 కోట్లు కేటాయించాం



బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం రూ.3.15 కోట్ల బడ్జెట్ కేటాయించాం. రోజూ 2,500 మంది భక్తులకు అన్న ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, బస్సులు, టాయిలెట్లు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులకు ఆహ్వానపత్రికలు అందజేశాం.

–భాస్కర్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థానం ఈఓ

కొత్త టీచర్లకు పాఠాలు

అభ్యసన ప్రక్రియలపై తర్ఫీదు
- మూడు దశల్లో శిక్షణ
- తొలుత ఎస్జీటీలకు, రెండు, మూడో విడతలో స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, పీఈటీలకు
- డీఎస్సీ–2024 ద్వారా 248 మంది ఉపాధ్యాయుల నియామకం

భువనగిరి : డీఎస్సీ–2024 ద్వారా నియమితులైన 248 మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వృత్యంతర శిక్షణ ఇస్తున్నారు. మూడు విడతల్లో భాగంగా తొలుత ఫిబ్రవరి 28న ఎస్‌జీటీలకు భువనగిరిలోని సాయికృప డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. శిక్షణ ఈ నెల 1,3 తేదీల్లో కొనసాగనుంది. రెండో విడతలో స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులకు 4, 5, 6వ తేదీల్లో నల్లగొండలో, స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు హైదరాబాద్‌లో 10, 11, 12వ తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

వీటిపై శిక్షణ
పాఠ్యపుస్తకాల సద్వినియోగం, తరగతి గది నిర్వహణ, విద్య, అభ్యసన, ప్రమాణాల పెంపు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన పద్ధతులు, విధానాలు, ఐసీటీ, ఐఎఫ్‌పీ, డిజిటల్ బోధన, తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులు
డీఎస్సీ–2024 ద్వారా జిల్లాలో 251మందికి గాను 248 మంది ఉపాధ్యాయ పోస్టుల్లో నియామకం అయ్యారు. వీరిలో ఎస్‌జీటీలు 133, పీఈటీలు ఇద్దరు, మిగిలిన వారు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రస్తుతం 133 మంది ఎస్‌జీటీలు, ఎనిమిది మంది ఆర్‌పీలకు భువనగిరిలోని సాయికృప డిగ్రీ కళాశాలలో శిక్షణ మొదలైంది. వీరికి టీఏతో పాటు భోజన వసతి కల్పిస్తున్నారు.



భువనగిరిలోని సాయికృప డిగ్రీ కళాశాలలో శిక్షణ పొందుతున్న ఎస్‌జీటీలు

సద్వినియోగం చేసుకోవాలి
కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు వృత్తిపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నాం. విడుతల వారీగా శిక్షణ ఇస్తున్నాం. ఎస్‌జీలకు మాత్రమే భువనగిరిలో శిక్షణ ఇస్తున్నారు. మిగతా వారికి నల్లగొండ, హైదరాబాద్‌లో ఉంటుంది. శిక్షణ ద్వారా తరగతి గది నిర్వహణ, విద్యా ప్రమాణాల పెంపు, బోధన, అభ్యసన ప్రక్రియలపై అవగాహన ఏర్పడుతుంది. ఈ అవకాశాన్ని కొత్త టీచర్లు సద్వినియోగం చేసుకోవాలి.

–సత్యనారాయణ, డీఈఓ

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి



టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న సైకిళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి : ఇంటర్ పరీక్షలకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని, లోపాలకు తావుండవద్దని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓలు, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై వారికి సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాల్లో 12,558 విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని.. ఇందులో ప్రథమ సంవత్సరం 6,208, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,350 మంది ఉన్నారని తెలిపారు. కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. కేంద్రాలకు ప్రశ్న పత్రాలను తరలించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల బండిళ్లకు సీల్ తొలగించడం, సమాధాన పత్రాలను ప్యాకింగ్ చేసే ప్రక్రియ సీసీ కెమెరాల నిఘాలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గంగాధర్, డీఐఈఓ రమణి తదితరులు పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధించిన 70 మంది విద్యార్థులకు సైకిళ్లు
పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన 70మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సిద్ధంగా ఉంచిన సైకిళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని 192 ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6,074 మంది ఉన్నట్లు తెలిపారు. కష్టపడి చదవి మంచి మార్కులు సాధించాలని కోరారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వడంతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, డీఈఓ సత్యనారాయణ, ఐటీసీఎల్, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భువనగిరి : విద్యార్థులు పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్ పేర్కొన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 89 ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.భువనగిరిలోని ఆర్‌బీ నగర్‌లో గల ఎస్సీ బాలికల హాస్టల్‌ను డీఎంహెచ్‌ఓ సందర్శించి వైద్యపరీక్షలను పరిశీలించారు. విద్యార్థులకు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుమన్ కళ్యాణ్, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ మనోహర్

ఎవరి లెక్కలు వారివే!

- అంచనాలు వేసుకుంటున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు
- తామంటే.. తామే గెలుస్తామని ధీమా
- ఐదుగురి మధ్యే గట్టి పోటీ ఉంటుందని చెబుతున్న నేతలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ –ఖమ్మం –నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయన్న అంచనాల్లో అభ్యర్థులు తనమునకలయ్యారు. జిల్లాలు, మండలాల వారీగా పోలింగ్ సరళిని బట్టి గెలుపు తమదంటే.. తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బరిలో 19 మంది
ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ఐదుగురి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు అంచనా వేస్తున్నాయి. పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, యూటీఎఫ్ బలపరిచిన, ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీచర్స్ జేఏసీ, కాంగ్రెస్ మద్దతుతో పోటీలో ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి, బీసీ వాదంతో బరిలో ఉన్న పూల రవీందర్, టీపీయూఎస్ బలపరిచిన, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

జిల్లాల వారీగా మారుతున్న బలాలు
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఒక్కో జిల్లాలో ఒక్కో అభ్యర్థి తమకు అనుకూలంగా ఉంటుందని అంచనాలు వేసుకుంటున్నారు. వరంగల్ జిల్లాలో తమకు మొదటి ప్రాధాన్య ఓట్లు అధికంగా వస్తాయని పీఆర్‌టీయూ, బీజేపీ, టీచర్స్ జేఏసీ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు చెబుతుండగా, ఖమ్మం జిల్లాలో తమ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వస్తాయని యూటీఎఫ్ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, వ్యాయామ, భాషా పండితులు, ఆదర్శ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీల ఉపాధ్యాయ ఓట్లలో తమకే గణనీయంగా వచ్చాయని టీచర్స్ జేఏసీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులు చెబుతున్నారు. వరంగల్‌తోపాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండలో తనకు ఎక్కువ ఓట్లు వస్తాయని టీచర్స్ జేఏసీ అభ్యర్థి అంచనా వేసుకుంటున్నారు. అయితే బహుజన, బీసీ వాదంతో పాటు అసంతృప్తి ఓట్లు తమకే వచ్చాయని, మొదటి ప్రాధాన్య ఓట్లతోనే గెలువబోతున్నామని పూల రవీందర్ అనుచరులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న సంఘాలపై వ్యతిరేక ఓట్లతోపాటు జాతీయవాద భావజాలమున్న ఉపాధ్యాయులంతా తమకే ఓటేశారని బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి అనుచరులు పేర్కొంటున్నారు.

గెలుపోటములు నిర్ణయించేది ద్వితీయ ప్రాధాన్య ఓట్లే?
హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికలో మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు సాధ్యం కాదని, ద్వి తీయ ప్రాధాన్య ఓట్లే గెలుపును నిర్ణయిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దాదాపుగా మొదటి ప్రాధాన్య ఓట్లు ఆయా సంఘాలు బలపరిచిన అభ్యర్థులకే పడతాయని చెబుతున్నారు. మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలుస్తామని, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు చెబుతున్నారు. మిగితా అభ్యర్థులను బలపరిచిన టీచర్స్ జేఏసీ, టీపీయూఎస్, బీజేపీ మాత్రం రెండో ప్రాధాన్య ఓట్లతోనే తుది ఫలితాలు వస్తాయని పేర్కొంటున్నాయి.



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

స్ట్రాంగ్ రూమ్‌కు సీల్
నల్లగొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసింది. అనంతరం 12 జిల్లాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను ఆర్జాలబావి సమీపంలోని గోదాం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో శుక్రవారం భద్రపరిచారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ దగ్గరుండి.. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయించారు.

భువనగిరికి చేరిన అఖండ జ్యోతి రథయాత్ర



భువనగిరిలో అఖండజ్యోతి రథయాత్రకు స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు



బీబీనగర్‌లో..

బీబీనగర్ : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ బర్కత్‌పురలోని యాదగిరి భవన్ నుంచి బయలుదేరిన స్వామివారి అఖండజ్యోతి రథయాత్రకు బీబీనగర్‌లో అఖండజ్యోతి కమిటీ సభ్యులు, భక్తులు, రాజకీయ నాయకులు ఘన స్వాగతం పలికారు. బాంబినో వర్మిసెల్లీ పరిశ్రమ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, నాయకులు శ్యాంగౌడ్, అంజనేయులు, సత్యనారాయణగౌడ్ బాంబినో కంపెనీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, మేనేజర్ శాస్త్రి, పీఆర్ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి : అఖండజ్యోతి రథయాత్రకు భువనగిరి పట్టణంలో యాత్ర చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్, నల్లగొండ, జంకానగూడెం చౌరస్తాల మీదుగా బస్టాండ్ సమీపం నుంచి వినాయక చౌరస్తా, పాత బస్టాండ్ మీదగా పాత వివేరా హోటల్ వద్దకు రథయాత్ర చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపల్ల బుచ్చిరెడ్డి, జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, ఫక్కీర్ కొండల్‌రెడ్డి, శెట్టి బాలయ్యయాదవ్, మంచి కంటి వెంకటేశం, దిడ్డి బాలాజీ, దేవరకొండ నర్సింహాచారి, చీకటి మల్లరాములు, బండారు శ్రీనివాస్, చందా మహేందర్ గుప్తా, మల్లేశం, నర్సింగ్‌రావు పాల్గొన్నారు. శనివారం ఉదయం రథయాత్ర యాదగిరిగుట్టకు బయలుదేరనుందని నిర్వాహకులు తెలిపారు.

అబ్బురపరిచిన ప్రదర్శనలు
జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన సైన్స్ పరికరాలు.. పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



నేత్రపర్వంగా ఊంజల్ సేవ
యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. ఆండాళ్‌దేవికి ఇష్టమైన నాదస్వరం వినిపించి హారతినిచ్చారు.